క్లుప్తంగా

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే


వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకెళ్లడం తప్పదని జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం అన్నారు. శుక్రవారం జగిత్యాల కొత్తబస్టాండ్ చౌరస్తాలో విస్తృత వాహనాల తనిఖీ చేపట్టారు. ఇన్సూరెన్స్, డ్రైవింగ్‌లైసెన్స్ లేని వారికి జరిమానా విధించారు. ఎలాంటి ఆధారాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, అలాగే వాహనం నడిపే వారికి డ్రైవింగ్‌లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పకుండా కలిగి ఉండాలన్నారు.

'ఈ-పాస్' తోనే ఎరువులు విక్రయించాలి


ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న ఏవో

జగిత్యాలఅగ్రికల్చర్: ఈ-పాస్‌తోనే ఎరువులు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి వినీల అన్నారు. జగిత్యాల అర్బన్ మండలంలోని తిప్పన్నపేటలో ఫర్టిలైజర్ షాపును శుక్రవారం తన సిబ్బందితో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ-పాస్ పద్ధతిని ప్రవేశపెట్టిందన్నారు. ఎక్కడైన ఈ-పాస్ లేకుండా ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న సిబ్బంది

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రతీ ఇంటి వద్ద మొక్కలు నాటాలని కమిషనర్ మోహన్ సూచించారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం పట్టణ శివారులో జాతీయ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు మొక్కలు నాటి, వాటి సంరక్షణకు కృషి చేయాలన్నారు. అలాగే పలు వార్డుల్లో పర్యటించి ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధుల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, దీనికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించకపోతే చర్యలు


దుకాణదారుడికి నోటీసు ఇస్తున్న ఎంపీవో

మల్యాల: దుకాణాదారులు, హోటళ్ల పరిసరాల్లో ప్లాస్టిక్ డబ్బాలు, చెత్తా పడేసేవారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీవో ప్రవీణ్ అన్నారు. మండల కేంద్రంలోని అడ్డరోడ్డులోని దుకాణాల వద్ద పడేసిన చెత్తను పరిశీలించారు. దుకాణాల వద్ద చెత్త వేసిన యజమానులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు, చెత్తపడేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా మహాలక్ష్మీ జాతర

ధర్మపురి: మండలంలోని నేరెళ్లలో శుక్రవారం మహాలక్ష్మీ జాతర వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆయుష్ జాతీయ స్థాయి ఎంట్రెన్స్‌లో 5 వ ర్యాంకు


సాయికృష్ణ

గొల్లపల్లి: జాతీయస్థాయిలో ఆయుష్ నిర్వహించిన పోస్ట్‌గ్రాడ్యుయేట్స్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో గొల్లపల్లికి చెందిన చాడ సాయికృష్ణ 15వ ర్యాంక్ సాధించారు. తెలంగాణ రాష్ట్రంలో రెండవ సాధించాడు. సాయికృష్ణ సంగారెడ్డిలోని ఎంఎన్ఆర్ మెడికల్ కళాశాలలో హోమియోపతి విద్యనభ్యసించాడు. తల్లిదండ్రులు చాడ శ్రీనివాస్-వనజ ఆనందం వ్యక్తం చేశారు.

వసతులు లేని వైకుంఠధామం

- పనిచేయని బోర్‌వెల్
- నీటికి ఇబ్బందులు
- చేసిన పనుల్లో నాణ్యతాలోపం
- అంత్యక్రియలకు ఇబ్బందులు
- పట్టించుకోని పాలకవర్గం


వైకుంఠధామంలో బిరడాలు లేని నల్లాలు


బర్నింగ్ షెడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఆరుబయట దహనాలు

రాయికల్: పట్టణంలో ఎవరైనా అంత్యక్రియలకు కుటుంబీకులు ఇబ్బంది పడుతున్నారు. కోట్లాది నిధులతో నిర్మించిన వైకుంఠధామంలో సరైన వసతులు లేవు. మరోవైపు పక్కనే కుక్కలు చచ్చిపోయి కంపువాసన కొడుతున్నాయి. మృతుల కుటుంబీకులు ముక్కుమూసుకుని దహన సంస్కారాలు చేయాల్సిన దుర్భర పరిస్థితి నెలకొంది. దహన సంస్కారాలు చేసిన అనంతరం కనీసం స్నానం చేయడానికి సైతం నీరు లేకపోవడంతోటు పక్కనే ఉన్న పొలాల్లోని నీటిని నెత్తిపై చల్లుకుని ఇంటికి వెళ్తున్నారు. పట్టణంలోని ఒడ్డెరకాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన శ్మశానవాటికలో పనులు పూర్తి కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాయికల్ మున్సిపాలిటీగా మారి నాలుగున్నరేళ్లు గడుస్తున్నప్పటికీ వైకుంఠధామం నిర్మాణ పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపం, పాలకవర్గ సభ్యులు పట్టించుకోకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి.

నత్తనడకన పనులు

వైకుంఠధామం నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రహరీ నిర్మాణం, బర్నింగ్‌షెడ్డు, వుడ్‌స్టోరేజీ, ఆఫీసురూమ్, వాష్ రూమ్, ఓపెన్‌షెడ్, బోర్‌వెల్, పార్క్, శివుని విగ్రహం, వంటి పనులు చేయాల్సి ఉంది. కాంట్రాక్టర్ అసంపూర్తిగా పనులు చేశాడు. స్నానపుగదులు, బర్నింగ్‌షెడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో ఆరుబయటే దహన సంస్కారాలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవైపు వర్షాకాలం దహన సంస్కారాలు చేయాలంటే నరక యాతన అనుభవిస్తున్నారు. మంగళవారం నాయీ బ్రాహ్మణుల కులానికి చెందిన ఓ వ్యక్తి చనిపోతే అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. స్నానపు గదులు సరిగా లేకపోవడం, ఉన్న ట్యాప్‌లకు బిరడాలు సైతం సరిగా బిగించలేదు. స్నానాల కోసం బోరు ఏర్పాటు చేసినప్పటికీ పనిచేయకపోవడంతో ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యుత్ సౌకర్యం సైతం లేకపోవడంతో చీకట్లో సెల్‌ఫోన్ల లైట్లతో దహనం సంస్కారాలు చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, కమిషనర్ చిరంజీవి స్పందించి వెంటనే బోర్లు రిపేరు చేయించి, అసంపూర్తి పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

స్నానం చేసేందుకు నీరు లేదు



మా కులానికి సంబంధించిన ఓ వ్యక్తి చనిపోతే దహన సంస్కారాలు చేయాలంటే చాలా ఇబ్బంది పడ్డాం. ఒకవైపు దుర్వాసన రావడంతో పాటు, మరోవైపు నీటి సౌకర్యం లేకపోవడంతో పొలాల్లోకి వెళ్లి నీరు చల్లుకునే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైకుంఠధామంలో వసతులు కల్పించాలి.

– రాచకొండ వెంకటేశ్, రాయికల్

బోరు రిపేర్ చేయిస్తాం



పట్టణంలోని వైకుంఠధామంలో వెంటనే బోరు రిపేరు చేయించి వసతులు కల్పిస్తాం. నల్లాలకు బిరడాలు బిగిస్తాం. దుర్వాసన రాకుండా అన్ని రకాల చర్యలు చేపడతాం. పనులు చేపట్టేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకువచ్చి పనులు పూర్తి చేయిస్తాం.

– జగదీశ్వర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్

స్వచ్ఛదనం, పచ్చదనం పకడ్బందీగా చేపట్టాలి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల: స్వచ్ఛదనం, పచ్చదనం పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 5 నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తాగునీటి సరఫరా, ఇంకుడుగుంతల నిర్మాణం, మురికికాలువలు, నీటి నిల్వనీటి ప్రాంతాలను శుభ్రం చేసి గుంతలను పూడ్చడం, సీజనల్ వ్యాధుల నియంత్రణ, దాడుల నివారణ, డ్రైడే శుభ్రం చేయడం, నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, డీఈ యాదగిరి, ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్టుల నిరసన


నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

జగిత్యాలటౌన్: ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాకు చెందిన జర్నలిస్టులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. మోటార్‌ర్యాలీతో కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల తో పాటు పాత్రికేయుల సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. జర్నలిస్టులకు దక్కాల్సిన ఇళ్ల స్థలాల కోసం ఎన్నో ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నామని తెలిపారు. ఎన్ని రకాలుగా నిరసనలు తెలిపినా ప్రభుత్వం నుండి స్పందన కరువైందన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు కందుకూరి శశిధర్, కమలాకర్‌రెడ్డి, టీవీ సూర్యం, శ్రీనివాస్‌రావు, కొత్తూరి మహేష్, బొడ్డుపల్లి అంజయ్య, జహీరుద్దీన్, జిల్లా సత్యం, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి


కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో తాజా మాజీ సర్పంచులు

కోరుట్ల రూరల్: సర్పంచులు తమ పదవీ కాలంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తాజా మాజీ సర్పంచుల జిల్లా ఫోరం మాజీ గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ అన్నారు. తాజా మాజీ సర్పంచుల ఫోరం పిలుపు మేరకు పెండింగ్ బిల్లుల సాధన కోసం అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వటంతో మండలంలోని మాజీ సర్పంచులను శుక్రవారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ బిల్లులు వెంటనే విడుదల చేయాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు వనతడుపుల అంజయ్య, భాస్కర్ రెడ్డి, పిడుగు రాధ, దుంపాల నర్సు, కోరెపు రవి, నూతిపెల్లి గంగరాజు, చెప్యాల నర్సయ్య పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

సారంగాపూర్: పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌కు తరలివెలుతున్న బీర్‌పూర్ మండల మాజీ సర్పంచ్‌లను బీర్‌పూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశారు.

పెగడపల్లి:మండలంలోని పలు గ్రామాలకు చెందిన తాజామాజీ సర్పంచులను పెగడపల్లి పోలీసులు శుక్రవారం మందస్తుగా అరెస్టు చేశారు. రాజేశ్వర్ రావు, లక్ష్మన్, బాబు స్వామి, తదితరులు పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఉన్నారు.

కథలాపూర్: కథలాపూర్ మండలంలోని మాజీ సర్పంచులు హైదరాబాద్ వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా శుక్రవారం అరెస్టు చేశారు. సాయంత్రం వదిలిపెట్టినట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

ఇబ్రహీంపట్నం: పెండింగ్ బిల్లులు చెల్లించాలన్న డిమాండ్లతో మాజీ సర్పంచులు హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ శుక్రవారం మాజీ సర్పంచులను ముందుస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై వారిని విడుదల చేశారు.

ధర్మపురి: మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

మెట్‌పల్లిరూరల్: వ్యాధులు ప్రబలకుండా ప్రతీ ఒక్కరు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మెట్‌పల్లి మండల వైద్యాధికారి అంజిత్ రెడ్డి అన్నారు.మెట్‌పల్లి మండలం ఆత్మనగర్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్య శిబిరంలో మొత్తంగా 56 మందిని పరీక్షించారు.ఇందులో ఎనిమిది మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి వారి రక్త నమునాలను వైద్య పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు.అనంతరం సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణవేణి,హెచ్‌ఈవో రమేష్,సూపర్‌వైజర్ ప్రభావతి, కార్యదర్శి నిజాముద్దిన్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు కొప్పుల పరామర్శ

గొల్లపల్లి/బుగ్గారం/పెగడపల్లి: నియోజకవర్గంలోని లోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

న్యాయవాదులకు హెల్త్ కార్డులు

కోరుట్ల: పట్టణంలోని న్యాయవాదులకు తెలంగాణ న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్ సలహామండలి సభ్యుడు, కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ శుక్రవారం హెల్త్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కోరుట్ల అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస రావు, ఆంజనేయులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కుక్కల బెడదపై కమిషనర్‌కు ఫిర్యాదు

కోరుట్ల: పట్టణంలోని 33వ వార్డులో కుక్కల బెడద తీవ్రంగా ఉందని వార్డుప్రజలు కమిషనర్ బట్టు తిరుపతికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. పిల్లలు, వృద్ధులు ఇంట్లోనుంచి బయటకు రావటం తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ రహీం, షేక్ మాజార్, ముస్తాక్, మజీద్, అఫీస్, సమీర్, రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలి

పెగడపల్లి: స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులు సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ప్రజలను కోరారు. పెగడపల్లిలో స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) ఓడీఎఫ్ ప్లస్ సుస్థిరతపై శుక్రవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మాణం చేసుకోవాలని, ఆరుబయటీ మలవిసర్జన చేయకుండా మరుగుదొడ్డి వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏలు.వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రంగారావుపేటలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. దీనిలో భాగంగా పంచాయతీ, ఐసీడీఎస్ అధికారులు శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కళ్యాణ్, అంగన్‌వాడీ టీచర్ సుమలత,ఫీల్డ్ అసిస్టెంట్ సంజీవ్ పాల్గొన్నారు.

ఒకటో వార్డులోనే కలపాలి

మెట్‌పల్లిరూరల్: తమ వార్డులోని ఓట్లు మరో వార్డు కిందికి మార్చడంపై మెట్‌పల్లి ఎంపీవో మహేశ్వర్ రెడ్డికి మాదిగ సంఘ సభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌లోని 1 వ వార్డులోని మాదిగ సామాజిక వర్గానికి చెందిన కొందరి ఓట్లు 2వ వార్డులోకి మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. వేరే వార్డులోకి తమని మార్చడంతో తమ సామాజిక వర్గానికి చెందిన ఓటర్ల సంఖ్య బలం తక్కువై వార్డు మెంబర్‌గా ఎన్నికయ్యే అవకాశం కోల్పోతున్నమని ఎంపీవో దృష్టికి తీసుకెళ్లారు. తమ ఓట్లు ఒక వార్డులో మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజారాం,మహేశ్, రాజం, శంకర్,లక్ష్మీనర్సయ్య,తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం


కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కోరుట్ల: మంత్రి సీతక్కపై బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేశారని, వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ అసమర్థ పాలనతో రాష్ట్రం వెనకబడిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పేరు ప్రతిష్టలకు భంగం కలిగించాలని బీఆర్ఎస్ కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్‌గౌడ్, కొంతం రాజం, కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు సురక్షితం



కొత్తదాంరాజుపల్లి, ఇబ్రహీంపట్నంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

జగిత్యాల/జగిత్యాలరూరల్/రాయికల్/సారంగాపూర్/మల్లాపూర్/ఇబ్రహీంపట్నం/పెగడపల్లి/మల్యాల: తల్లిపాలు ఎంతో ముఖ్యమని, పుట్టిన అరగంటలోపు తల్లిపాలు పట్టించాలని మహిళ సాధికారత కో-ఆర్డినేటర్ అశ్విని అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో, జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్‌లో, వివిధ మండలాల్లోని పలు గ్రామాల్లో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాల విశిష్టతను గురించి అధికారులు వివరించారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలను ఖచ్చితంగా పట్టించాలని, దీని వల్ల బిడ్డలో రోగనిరోధకశక్తి పెరగడమే కాకుండా సమతుల్యమైన పోషక పదార్థాలు అందుతాయన్నారు. కార్యక్రమాల్లో జెండర్ స్పెషలిస్ట్ స్వప్న, ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శంకరమ్మ, భారతి స్వరూపరాణి,మహేశ్వరి, సుభద్ర, వైద్యాధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సోషల్ వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం


ధర్మపురిలో నాయకుల సంబరాలు


రాయికల్‌లో క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోరుట్ల/రాయికల్/ధర్మపురి/కథలాపూర్/ఇబ్రహీంపట్నం: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయని దళిత సంఘాలు, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘ నాయకులు అన్నారు. సుప్రీం కోర్టు తీర్పుపై శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. ధర్మపురిలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు పంపి,పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఇబ్రహీంపట్నంలో అంబేడ్కర్, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు నాయకులు క్షీరాభిషేకం చేశారు. కథలాపూర్‌లో ర్యాలీ నిర్వహించి, టపాసులుపేల్చి ఆట, పాటలతో సందడి చేశారు. స్వీట్లు పంపిణ చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణతో ఎంతో మంది ఎస్సీ.ఎస్టీ ఉప కులాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొందరగా వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నాయకులు శోభన్, ఉయ్యాల నర్సయ్య, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుమలు లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు తొట్ల అంజయ్య, మాదిగ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెట్టుపెల్లి లక్ష్మణ్ దళిత సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

పెగడపల్లి: పెగడపల్లి మండలం అయితిపల్లి గ్రామానికి చెందిన మంత్రి శ్వేత ఇల్లు శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురైంది. శ్వేత భర్త నాగరాజు జీవనోపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. సొంత ఇల్లు లేకపోవడంతో గ్రామానికి చెందిన ద్యావ గంగారెడ్డి ఇంట్లో అద్దెకుంటూ కుట్టుమిషన్‌తో పాటు బీడీలు చుడుతూ పిల్లలను చదివిస్తుంది. పిల్లలను బడిలో దింపేందుకు వెళ్లిన శ్వేత తిరిగి వచ్చే సరికి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచాయి. చుట్టుపక్కల వారు వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే మంటలు విస్తరించి ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంటిలోపలి పైకప్పుతో పాటు నిత్యావసర సరుకులు, ఫర్నిచర్, దుస్తులు, రెండు తులాల బంగారం, రూ. 50 వేలు నగదు కాలిపోయాయి. సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. పరిహారం అందించి ఆదుకోవాలని అధికారులను కోరింది. కాగా ఆర్ఐ శ్రీనివాస్, ఏఎస్సై సత్తయ్య ఘటనా స్థలిని సందర్శించి వివరాలు సేకరించారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన వ్యక్తి

కోరుట్ల: పట్టణంలోని తిలక్ రోడ్‌లో నివాసముండే కటుకం నారాయణ కుమారుడు రమేశ్ నాలుగేళ్ల క్రితం మతి స్థిమితం కోల్పోయి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు.పట్టణానికి చెందిన 32వ వార్డు కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ చొరవతో పోలీసులు రమేశ్ ను శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించారు. కొద్ది రోజుల క్రితం సోషల్ మీడియాలో వచ్చిన పోస్టును కౌన్సిలర్ లక్ష్మీనారాయణ చూసి విశాఖపట్నంలోని ఓల్డ్ ఏజ్ హోమ్‌లో రమేశ్ ఉన్నట్లు గుర్తించి, విశాఖపట్నం వెళ్లి అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్‌ను కలిసి ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకురాలితో మాట్లాడి రమేశ్‌ను కోరుట్లకు తీసుకవచ్చాడు. కోరుట్ల ఎస్సై ఎండీ ఆరిఫొద్దీన్ రమేశ్ తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి తప్పిపోయి తిరిగి వచ్చిన అప్పగించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ లక్ష్మీనారాయణను పలువురు అభినందించారు.

జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలు అరికట్టవచ్చు

గొల్లపల్లి: జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలు అరికట్టవచ్చని ట్రాన్స్‌కో డీఈ రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం గొల్లపల్లి మండల కేంద్రంలో పొలంబాటలో భాగంగా రైతులకు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా సూచనలిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఈ వరుణ్‌కుమార్, ఏఈ దివాకర్‌రావు, సబ్ ఇంజనీర్ దామోదర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

బుగ్గారం: రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఏడీఈటీ సింధూర్‌శర్మ అన్నారు. పొలంబాటలో భాగంగా బుగ్గారంలో శుక్రవారం స్థానిక రైతులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. రైతులు తమ పొలాల్లో ఇనుప బాక్సులకు బదులుగా ప్లాస్టిక్ స్టార్టర్ బాక్సులను అమర్చుకోవడం వలన ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏఈ బండారి అశోక్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపట్టాలి

బుగ్గారం: మండల కేంద్రంలో వెంటనే ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. బుగ్గారం నూతన మండలంగా ఏర్పడి ఏళ్ల గడుస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు పక్కాభవనాలు నిర్మించకపోవడం ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నదన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం నూతన మండలాలను ఏర్పాటు చేసిందే తప్ప అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించలేదన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడుస్తున్నా వీటి గురించి పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మంచె రాజేశ్, మెడవేణి శ్రీధర్,పల్లికొండ అనిల్,పంచిత లక్ష్మణ్,అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలప్రిన్సిపల్‌గా రామకృష్ణ

జగిత్యాల: జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రొఫెసర్ ఎల్.రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సత్యనారాయణ కరీంనగర్‌కు బదిలీ కాగా, రామకృష్ణ జగిత్యాలకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ అశోక్, సీనియర్ అధ్యాపకులు చంద్రయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

పెగడపల్లి:మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన మిట్టపల్లి కొండాల్‌రెడ్డి అనే వ్యక్తి సెల్‌ఫోన్ పోగొట్టుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన పోలీసులు పోయిన సెల్‌ఫోన్‌ను గుర్తించి శుక్రవారం కొండాల్‌రెడ్డికి అందించినట్లు ఎస్సై సీహెచ్ రవికిరణ్ తెలిపారు.

మొక్కలను సంరక్షించాలి

ధర్మపురి: మొక్కలను సంరక్షించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ కోరారు. వన సంరక్షణలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరెడ్డి, మేనేజర్ గంగాధర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.